

రాష్ట్రంలో మార్పు అవసరం

- ఈ నాలుగున్నరేళ్లలో ఎక్కడా అభివృద్ధి లేదు
- ప్రజలు ఈ ఏడాది రాష్ట్రాన్ని కాపాడుకోవాలి
- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ
- అప్పులు, అభివృద్ధిపై వైపీసీ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

- మెయిన్‌లో



కొణతాల రామకృష్ణ

అటవీ శాఖలో అవినీతి వృక్షాలు

అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై చర్యలకు మీనమేషాలు

- గత ఏప్రిల్‌లో తునిక కలప అక్రమ రవాణా
- 'నల్ల తుమ్మ' అంటూ లంచం తీసుకొని విడిచి పెట్టిన నర్సీపట్నం అధికారి
- అదే కలపను పట్టుకుని సీజ్ చేసిన తుని అటవీ అధికారులు
- 'ఆంధ్రజ్యోతి'లో కథనాలతో ఉన్నతాధికారులు విచారణ
- నర్సీపట్నం అధికారి అక్రమాలకు పాల్పడినట్టు నిర్ధారణ
- ఎనిమిది నెలలైనా చర్యలు తీసుకోని వైనం
- బుచ్చెయ్యపేట మండలంలో టేకు కలప కేసులోనూ ఇదే తీరు



తుని అటవీ అధికారులు తునిక కలపతో పట్టుకున్న వ్యాన్ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, జనవరి 1:

అటవీ శాఖలో అవినీతికి పాల్పడుతున్న కొంతమంది సిబ్బందికి ఉన్నతాధికారుల అండదండలు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలప అక్రమ రవాణాకు సంబంధించి రెండు సంఘటనల్లో పక్కా ఆధారాలు లభించినప్పటికీ సంబంధిత అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోకుండా సీసీఎఫ్ తాత్సారం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇందుకు సంబంధించి పూర్వాపరాలను పరిశీలిస్తే...

అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి నుంచి తునిక కలపను వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా గత ఏడాది ఏప్రిల్ 27వ తేదీన గొలుగొండ మండలం యర్రవరంలోని చీడిగుమ్మల చెక్‌పోస్టు వద్ద అటవీ సిబ్బంది అడ్డుకున్నారు. కలపకు పర్మిట్ లేదని గుర్తించి వ్యాన్‌ను నర్సీపట్నం కలప డిపోకి తరలించారు. అటవీ అధికారి రూ.25 వేలు లంచం తీసుకొని తునిక కలపతో ఉన్న వ్యాన్‌ను వదిలేశారు. వ్యాన్‌లో వున్నది తునిక కలప కాదని, నల్లతుమ్మ కర్ర అని ఉన్నతాధికారులను పక్కదారి పట్టించారు. అనంతరం కలప వ్యాన్ తుని వైపు వెళుతుండగా కాకినాడ జిల్లా కోటనందూరు సమీపంలో తుని అటవీ అధికారులు ఆపి తనిఖీ చేశారు. ఎటువంటి పర్మిట్ లేకపోవడంతో కలపతోపాటు వ్యాన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. వ్యాన్ డ్రైవర్ దగ్గర నుంచి నకిలీ చలానా స్వాధీనం చేకున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో పీసీసీఎఫ్ ఆదేశాలతో రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో విచారణ చేసి చేపట్టారు. రిజర్వ్ ఫారెస్టులో తునిక చెట్లు నరికి, కలపను అక్రమంగా తరలిస్తున్నట్టు నిర్ధారించారు. అనంతరం నివేదికను ... మిగతా 8వ పేజీలో



బుచ్చెయ్యపేట మండలం ఉప్పరిగూడెంలో పర్మిట్ లేకుండా తరలిస్తున్న కలపను పట్టుకున్న స్క్వాడ్ డీఎఫ్ఓ, సిబ్బంది (ఫైల్ ఫొటో) ... మిగతా 8వ పేజీలో

ఫుల్లు కిక్కు!

- నూతన సంవత్సరం సందర్భంగా ఏరులై పారిన మద్యం
- జిల్లాలో డిసెంబరు 31న భారీ ఎత్తున లిక్కర్ అమ్మకాలు
- రోజువారీ సగటు విక్రయాలు రూ.2.3 కోట్లు..
- గత ఏడాది చివరి రోజున రూ.6.28 కోట్ల విలువ చేసే మద్యం తాగేసిన మందుబాబులు



అనకాపల్లిలో ఒక మద్యం దకాణం వద్ద కొనుగోలుదారులు

అనకాపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. సాధారణ రోజులతో పోలిస్తే డిసెంబరు 31వ తేదీన ప్రభుత దుకాణాల్లో దాదాపు మూడురెట్లు అధికంగా అమ్మకాలు సాగాయంటే మందుబాబులు ఎంత ఎంజాయ్ చేశారో అర్థం అవుతున్నది.

నూతన సంవత్సరం వేడుకల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 31వ తేదీన మద్యం అమ్మకాలకు నిబంధనల గేట్లు ఎత్తేసింది. ఆదివారం అర్ధరాత్రి వరకు మద్యం విక్రయించడానికి అనుమతి ఇస్తూ ఎక్సైజ్ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం మద్యం షాపులను రాత్రి 9 గంటలకల్లా మూసేయాలి. కానీ ఆది, సోమవారాలు అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగించింది. బార్ అండ్ రెస్టారెంట్లలో మరో గంట.. అంటే అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం సేవించడానికి అనుమతి ఇచ్చింది. అసలే నూతన సంవత్సర వేడులు.. ఆపైన అర్ధరాత్రి వరకు తెరిచి వున్న మద్యం దుకాణాలు.. ఇంకేముంది మందుబాబులు ఎడాపెడా మద్యం కొనుగోలు చేశారు. జిల్లాలో మొత్తం 150 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారుల గణాంకాల ప్రకారం సగటున రోజుకు రూ.2.3 కోట్ల విలువ చేసే మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. కానీ నూతన సంవత్సరం ఆగమన వేడుకల సందర్భంగా ఆదివారం మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో ... మిగతా 8వ పేజీలో

కొత్తూరులో చెరువు కబ్జా

అధికార పార్టీ మహిళా ప్రజాప్రతినిధి కుమారుడు భూ దందా

చెరువు అభివృద్ధి మాటున విలువైన స్థలంపై కన్ను

- తన మాట వినకపోతే మంత్రులతో చెప్పి బదిలీ చేయిస్తానని హెచ్చరిక
- ప్రధాన రహదారి పక్కన 30 సెంట్లు ఆక్రమణ
- మార్కెట్ విలువ సెంటు రూ.20 లక్షలు
- సెంటు రూ.10 లక్షల చొప్పున విక్రయం
- వెంటనే ఇళ్లు నిర్మించుకుంటే ఎల్‌పీసీలు మంజూరుచేయిస్తానని కొనుగోలుదారులకు భరోసా



చదును చేసి ఆక్రమించిన చెరువు స్థలం ఇదే

కొత్తూరు (అనకాపల్లి), జనవరి 1:

అనకాపల్లి మండలంలో మేజర్ పంచాయతీ అయిన కొత్తూరులో ఎర్రచెరువు ఆక్రమణలకు గురవుతున్నది. అధికారి పార్టీకి చెందిన ఓ మహిళా ప్రజాప్రతినిధి తనయుడు, ఈ చెరువు స్థలాన్ని దర్జాగా ఆక్రమించి సెంట్లు చొప్పున విక్రయిస్తున్నాడు. మంత్రుల వద్ద తనకు పలుకుబడి వుందని చెప్పుకుంటూ, అధికారులను బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎర్రచెరువు ఆక్రమణకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

కొత్తూరు మేజర్ పంచాయతీ సర్వే నంబరు 613/2లో సుమారు 17 ఎకరాల్లో ఎర్రచెరువు విస్తరించి వుంది. అనకాపల్లి పట్టణంలో నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం పక్కనే వుండడంతో ఇక్కడ ప్రస్తుతం సెంటు రూ.20 లక్షలు పలుకుతున్నది. రోడ్డు పక్కన కొంతస్థలాన్ని గతంలోనే పూడ్చివేసి ఒక ఆలయం, పోలీసు స్టేషన్ నిర్మించారు. రహదారి పక్కన కొంతమంది బడ్డీ కొట్లు ఏర్పాటుచేసుకున్నారు. దీంతో మిగిలిన స్థలంపై వైసీపీకి చెందిన ఒక 'స్థానిక' మహిళా ప్రజాప్రతినిధి కుమారుడి కన్ను పడింది. చెరువు అభివృద్ధి మాటున కబ్జాకు తెరతీశాడు. పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి, తాను చెప్పినట్టు వినకపోతే మంత్రి అమర్‌నాథ్‌కు చెప్పి బదిలీ చేయిస్తానని బెదిరించాడు. ప్రభుత్వ నిధులతో చెరువు ... మిగతా 8వ పేజీలో



చెరువు స్థలంలో చేపట్టిన ఇంటి నిర్మాణం



జాయింట్ కలెక్టర్ జాహ్నవికి మొక్కను అందజేస్తున్న డీఎఫ్‌వో లక్ష్మణ్. చిత్రంలో కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

సమన్వయంతో కలిసి పనిచేద్దాం

- జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుదాం
- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపు
- కలెక్టర్, జేసీలకు పలువురు అధికారులు, ఉద్యోగులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు

అనకాపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. సోమవారం నూతన ఆంగ్ల సంవత్సరం తొలి రోజును పురస్కరించుకుని కలెక్టరేట్‌లో పనిచేస్తున్న పలువురు అధికారులు, ఉద్యోగులు.. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జాహ్నవిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖల ఉద్యోగులు గతంలో మాదిరిగానే కలిసి పనిచేస్తే అన్ని రంగాల్లో సత్ఫలితాలు వస్తాయన్నారు. ఈ ఏడాది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం, జిల్లా వీఆర్వోల సంఘం, వివిధ ఉపాధ్యాయ సంఘాలు, ఆధ్యాత్మిక సంస్థలు... కలెక్టర్, జేసీలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

తుమ్మపాలలో వ్యాన్ ఢీకొని ఆశ కార్యకర్త మృతి

- 7లో



ప్రభుత్వానికి అంగన్‌వాడీలు అల్టిమేటం

తమ డిమాండ్లను 3వ తేదీలోగా నేరవేర్చాలని, లేకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసినట్టు రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం (సీఐటీయూ అనుబంధ) నేతలు వెల్లడించారు. కాగా డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారానికి 21వ రోజుకు చేరింది. అన్ని కేంద్రాల్లో నిరసన శిబిరాలను కొనసాగిస్తున్నారు.

అనకాపల్లి నెహ్రూచౌక్ సమీపంలో ఏర్పాటు చేసిన ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

క్రైం... crime news

వీఆర్‌వో ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, జనవరి 1: మండలంలో శెట్టిపాలెం సచివాలయం వీఆర్‌వోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నారు. నర్సీపట్నం టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్డేపల్లికి చెందిన ప్రసాద్(35) వీఆర్‌వోగా పని చేస్తున్నారు. ఆయన ఆదివారం మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి మధ్యాహ్నం వరకు పని చేశారు. ఆయనతో పాటు అతని భార్య కూడా కార్యాలయానికి వచ్చింది. ఆ తరువాత మాకవరపాలెం బస్టాండ్‌లో ఆమెను విశాఖపట్నం వెళ్లే బస్సు ఎక్కించి అతను బొడ్డేపల్లిలోని ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి 7 గంటల సమయంలో తన భార్య ఫోన్‌కు మెసేజ్ పంపాడు. తిరిగి ఆమె అతని సెల్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి పక్క ఇంట్లో ఉంటున్న వారికి ఫోన్ చేసి తమ ఇంటికి వెళ్లి చూడమని చెప్పింది. వారు గది తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లగా ప్రసాద్ ఉరివేసుకుని విగతజీవిగా ఉన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో వారు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నర్సీపట్నం టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఆశ కార్యకర్త మృతి

» మరో ఇద్దరు ఆశలు, ఆటో డ్రైవర్‌కు గాయాలు



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు



అమ్మాజీ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, జనవరి 1: తుమ్మపాల మెయిన్ రోడ్డు చర్చి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆశ కార్యకర్త మృతిచెందగా మరో ఇద్దరు కార్యకర్తలు గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మపాల అంబేడ్కర్ కాలనీకి చెందిన ఆశ కార్యకర్త తోటాడ అమ్మాజీ(58) వైద్య సేవల నిమిత్తం సోమవారం ఉదయం తుమ్మపాల పీహెచ్‌సీకి వెళ్లింది. అనంతరం సహచర ఆశ కార్యకర్తలు మద్దాల ప్రమీల, పీలా మంగలతో కలిసి తిరిగి ఇంటికి వస్తున్నది. ఈ సమయంలో చోడవరం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న వ్యాన్‌ను, ఆగి ఉన్న ఆటోను ఢీకొనడంతో పాటు ఎదురుగా నడుచుకుంటూ వస్తున్న అమ్మాజీ, ప్రమీల, మంగలను ఢీకొన్నది. దీంతో అమ్మాజీ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మిగిలిన ఇద్దరితోపాటు ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఆటోను, మహిళలను ఢీకొన్న వ్యాన్‌ను డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. స్థానిక యువకులు వెంటనే బైక్‌లపై వెళ్లి విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆశ కార్యకర్త తోటాడ అమ్మాజీ కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, ప్రధాన కార్యదర్శి ఇ.పార్వతి, కోశాధికారి సూర్యకళ, సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

» ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో, బైక్

నర్సీపట్నం అర్బన్, జనవరి 1: మండలంలోని చెట్టుపల్లి గ్రామ సమీపంలో ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చెట్టుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి నర్సీపట్నం నుంచి రోలుగుంట వైపు వెళుతున్న ఆటో, రావికమతం నుంచి నర్సీపట్నం వెళుతున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నర్సీపట్నం మండలం ఓఎల్ పురం గ్రామానికి చెందిన నీలపు అప్పలనాయుడు(67) తీవ్రంగా గాయపడగా, కేజీహెచ్‌కి తరలిస్తే అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. నల్ల కొండబాబు, ఈదల సత్యవతికి గాయాలయ్యాయని ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నేక్ ద్వారా ఎలక్ట్రిషియన్‌కు ఉచిత శిక్షణ

అనకాపల్లి రూరల్, జనవరి 1: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ఎలక్ట్రిక్, ప్లంబింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఏడీ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసై 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. సుమారు రెండు నెలలపాటు శిక్షణ ఉంటుందని, మరిన్ని వివరాల కోసం 77802 75922కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

వీధుల్లో క్షీణించిన పారిశుధ్యం

» పారిశుధ్య కార్మికుల సమ్మెతో 'పట్నం'లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు

» పూడుకుపోయిన డ్రైనేజీలు

» పెరిగిన దోమల బెడద



వెంకునాయుడుపేటలో పేరుకుపోయిన చెత్త

నర్సీపట్నం, జనవరి 1 : మునిసిల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకుంది. అన్ని వార్డుల్లో చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకు పోయింది. ప్రజారోగ్య అధికారుల అంచనా ప్రకారం అన్ని ప్రాంతాల్లో రోజుకు 30 టన్నుల చొప్పున గత ఏడు రోజుల్లో సుమారు 200 టన్నుల చెత్త పేరుకు పోయింది. డంపర్ బిన్నులన్నీ నిండిపోయి చెత్త రోడ్ల మీద చెల్లాచెదురుగా పడి అపారిశుధ్యం తాండవిస్తున్నది. హోటళ్లు, పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారులు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్ల పక్కన పడేస్తున్నారు. డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద పెరిగి పోయింది. ఇళ్లలో చెత్త డబ్బాలు నిండి పోవడంతో జనం తప్పనిసరి పరిస్థితిల్లో వీధుల్లో పడేస్తున్నారు. ఇదిలావుండగా ప్రభుత్వం మనసు మారి, తమ డిమాండ్లను అంగీకరించేలా చూడాలంటూ కార్మికులు అబీద్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రిలే దీక్షలు చేపట్టారు.



నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

వైకుంఠవాసునిగా ఉపమాక వెంకన్న

విశిష్ట అలంకరణలో దర్శించుకున్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఉభయదేవేరులతో వైకుంఠవాసునిగా భక్తులకు విశిష్ట దర్శనమిస్తున్న ఉపమాక వెంకన్న

నక్కపల్లి, జనవరి 1: ఉపమాక ఆలయంలో వేంకటేశ్వరస్వామి సోమవారం వైకుంఠవాసునిగా విశిష్ట అలంకరణలో దర్శనమిచ్చారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రాపత్తు అధ్యయనోత్సవాలు చివరి రోజైన సోమవారం ఆలయ ఆచార వ్యవహారాల ప్రకారం పరమపద ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వైకుంఠ వాసునిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో పుణ్యకోటి వాహనంలో శేషపాన్పుపై ఉభయదేవేరులు ఇరుపక్కలా ఆశీనులవ్వగా, స్వామివారు వైకుంఠ వాసునిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నందూరి రాజగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామికి హారతులిచ్చారు. తదుపరి సప్పరం వాహనంపై అలంకరించి తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఆలయంలో రాపత్తు ఉత్సవాలు ముగిసినట్టు అర్చకులు ప్రకటించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 1: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి కోరారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్, జేసీలకు యూటీఎఫ్ ప్రతినిధులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు చినబ్బాయి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారుల సమస్యలు పరిష్కరించిన వారికే ఎన్నికల్లో మద్దతు'

పరవాడ, జనవరి 1 : మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం మత్స్యకారుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిన నాయకులకే వచ్చే ఎన్నికల్లో తమ మద్దతును ప్రకటిస్తామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి ముత్యాలమ్మపాలెం తీరంలోని గెస్ట్‌హౌస్‌లో మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఐదేళ్ల పాలనలో మత్స్యకార గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఉపాధి కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం, తంతడి సర్పంచులు చేపల మసేను, చోడిపల్లి దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, సూరాడ పెంటయ్య, మైలపల్లి అప్పన్న, అర్జిల్లి ప్రకాష్, సూరాడ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అత్యాచారం కేసులో చురుగ్గా విచారణ

» పోలీసుల అదుపులో 11 మంది నిందితులు

» బాధితురాలికి చికిత్స

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు ఇప్పటివరకూ 11 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మరికొంతమంది కోసం గాలిస్తున్నారు. బాధిత బాలిక మానసిక ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. బాలిక కుటుంబానిది ఒడిశాలోని కలహండి జిల్లా కాగా ఉపాధి నిమిత్తం విశాఖపట్నం వచ్చి కంచరపాలెంలో నివాసం ఉంటోంది. ఆ బాలిక కూడా ఓ దగ్గర పనికి కుదిరింది. అక్కడ ఓ యువకుడు పరిచయమై ప్రేమ పేరుతో నమ్మించి గత నెల 17వ తేదీన హోటల్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమెను లోబరుచుకున్నాడు. అనంతరం తన మిత్రుడిని పిలిపించాడు. ఆమె బాధతో బీచ్‌కు వెళ్లగా, అక్కడ ఇంకో వ్యక్తి ఆశ్రయం ఇస్తానని చెప్పి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తరువాత ఆమెపై చాలామంది అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తండ్రి గత నెల 18న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టి, ఆమె ఒడిశాలోని స్వస్థలంలో ఉందని గుర్తించి తీసుకువచ్చారు. తల్లిదండ్రుల సమక్షంలో విచారించగా, నగరంలో చాలా హోటళ్లకు తిప్పారని, అత్యాచారం చేశారని తెలిపింది. ఆమె చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు 11 మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో కొందరు ఆమెను ఒడిశా తీసుకువెళ్లినట్టు తెలిసింది. వారు ఒడిశాకు చెందిన వారా?, ఇక్కడివారా?...ఎక్కడ పరిచయం అయినవారో తెలుసుకోవడానికి పోలీసులు యత్నిస్తున్నారు. అలాగే ఆమె నగరంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లకుండా, ఒడిశా ఎందుకు వెళ్లింది?, నిందితులు ఏ విధంగా మభ్యపెట్టారనే వివరాలు సేకరిస్తున్నారు. ఈ కేసును దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

'న్యాయం జరిగే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరు'

కె.కోటపాడు, జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన నిధులన్నీ తిరిగి గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్‌లకు జమ చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరు సాగిస్తూనే ఉంటామని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,66 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి సొంత పథకాలకు వాడుకుందన్నారు.

మొక్కల పెంపకంతో ఆరోగ్యకర వాతావరణం

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మొక్క నాటి, నీరు పోస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 1 : మొక్కల పెంపకం మానవాళి మనుగడతో ముడిపడి ఉందని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం అనకాపల్లి నుంచి గాజువాకకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి జలగలమదుం సమీపంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే మానవాళికి ప్రాణాధారమైన ఆక్సిజన్ వృద్ధి చెందుతుందని, తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చనన్నారు. చెట్ల పెంపకం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని, మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీవో శిరీషారాణి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి మంజులావాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు



ఎస్పీ మురళీకృష్ణతో పరవాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులు

అనకాపల్లి రూరల్, జనవరి 1: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ సబ్ డివిజన్‌లలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు తరలివచ్చి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఏఎస్పీ విజయభాస్కర్‌లను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. డీటీసీ డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు వచ్చి పోలీస్ ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు చెప్పారు.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు


అనకాపల్లి టౌన్: కొణతాల రామకృష్ణకు శుభాకాంక్షలు చెబుతున్న అభిమానులు


దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు


టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు


మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందను సత్కరించిన టీడీపీ నాయకులు

అనకాపల్లి టౌన్/పరవాడ/కోటవురట్ల/ పాయకరావుపేట / రూరల్/ఎస్. రాయవరం/అచ్యుతాపురం/రాంబిల్లి/ ఎలమంచిలి/సబ్బవరం, జనవరి 1 : నూతన సంవత్సరం వేడుకలను పట్టణంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వివేకానంద హాల్‌లో అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతికి వైసీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అధికారులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సంతబయలు పెదరామస్వామి కల్యాణ మండపంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్, ప్రభాకర్, జయవీర్‌లకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు గజమాలలతో సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావుకు పార్టీ నాయకులు గజమాలలతో సత్కరించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు నాగజగదీశ్వరరావును ఘనంగా సత్కరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ కార్యాలయం వద్ద నేతలు, కార్యకర్తలు గజమాలలతో సత్కరించారు. కశింకోట మండల నాయకులు బెల్లం దిమ్మను బహూకరించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సంతబయలు సుబ్రహ్మణ్య ఘాట్ వద్ద మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు అనకాపల్లి జిల్లాతో పాటు విశాఖనగరానికి చెందిన రాజకీయ నాయకులు, అధికారులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెప్పారు. పరవాడ మండలం వెన్నెలపాలెంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి టీడీపీ నేతలు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్‌సిన్హాకు అన్ని యూనియన్‌ల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోటవురట్ల మండలం తంగేడులో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నక్కపల్లిలో తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనితకు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ నివాసం వద్ద వైసీపీ నాయకులు న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. పాయకరావుపేట మండలంలోని పెంటకోటలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్యాల రామారావుకు పార్టీ నేతలు, కార్యకర్తలు, ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గుంటపల్లిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్‌కు రాజకీయ నాయకులు, అధికారులు, అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 150 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఎస్.రాయవరం మండలంలోని కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో వైసీపీ నాయకులు, శ్రేణుల సమక్షంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కేకు కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. అచ్యుతాపురం టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ నేతలు, కార్యకర్తలు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెరువుపల్లి, కొత్తపట్నం, అచ్యుతాపురం, దిబ్బపాలెం తదితర గ్రామాల నుంచి ఇతర పార్టీలకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వీరందరికి ప్రగడ నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే అఖిల భారత రామ్‌చరణ్ యువత, జనసేన నేత లాలం చందు మెగాస్టార్ చిరంజీవిని ఆయన స్వగృహంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజును కొండకర్ల గెస్ట్‌హౌస్‌లో పలువురు వైసీపీ నాయకులు


అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, అభిమానులు

కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాంబిల్లి మండలం దిమిలిలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, విశాఖలో ఉన్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీలను టీడీపీ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హరిపురంలో జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్‌ను కలిసి పార్టీ నేతలు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు జన్మదిన వేడుకలు దిమిలిలోని ఆయన స్వగృహంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఎలమంచిలిలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారిలకు మునిసిపల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైసీపీ నేతలు, డెయిరీ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార వర్మలను కలిసి పార్టీ నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్‌ను సోమవారం ఎలమంచిలి పార్టీ కార్యాలయంలో జనసేన నేతలంతా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సబ్బవరంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికు పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా మొగలిపురం లోవిశాఖ దక్షిణం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జిని పలువురు నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


పరవాడ: బండారుకు గజమాల వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ శ్రేణులు


నక్కపల్లి: మాజీ ఎమ్మెల్యే అనితను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం


ఎలమంచిలి: మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావును సన్మానిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు


ఎస్.రాయవరం: ఎమ్మెల్యే గొల్ల బాబూరావును గజమాలతో సత్కరిస్తున్న వైసీపీ నాయకులు

అటవీ శాఖలో అవినీతి వృక్షాలు

... 5వ పేజీ తరువాయి

పీసీసీఎఫ్‌కు అందజేశారు. దీనిని పరిశీలించిన అటవీ శాఖ ఉన్నతాధికారులు.. నకిలీ చలానా జారీ చేసిన రాజవొమ్మంగి రేంజ్ అటవీ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. అనకాపల్లి జిల్లా అటవీ అధికారి కూడా విచారణ చేసి సీసీఎఫ్‌కి నివేదిక అందజేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న అధికారులు, సిబ్బందిపై చార్జ్‌షీటు సిద్ధం చేశారు. నర్సీపట్నం కలప డిపో అధికారులు లంచం తీసుకొని తునిక కలప వ్యాన్‌ను విడిచిపెట్టారని రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో, జిల్లా అటవీ అధికారి నివేదికల్లో పొందుపరిచినప్పటికీ ఇంతవరకు శాఖా పరంగా చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పైగా తునిక కలప కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని సీసీఎఫ్ పరిధిలోని జీఐఎస్ విభాగానికి డిప్యూటేషన్ మీద పంపంచారు.

టేకు కలప రవాణా కేసులోనూ ఇదే తీరు!

బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట పంచాయతీ ఉప్పరిగూడెంలో గత ఏడాది అక్టోబరులో ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం సిబ్బందితో కలిసి దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. టేకు కలపకు రూట్ పర్మిట్ లేకుండా కేవలం రూ.4,800 కాంపౌండింగ్ రుసుము రశీదు మాత్రమే ఉండడంతో ట్రాక్టర్‌తోసహా కలపను సీజ్ చేసి నర్సీపట్నం డిపోకు తరలించారు. టేకు కలప కొలతలు తీసి 6.35 సీఎంటీ (222 అడుగులు) ఉన్నట్టు నిర్ధారించారు. ఇంత భారీ మొత్తం కలపకు రూ.4,800 కాంపౌండింగ్ రుసుము చాలా తక్కువని, కలపను అక్రమంగా తరలించడానికి సెక్షన్ అధికారి సహరించారని స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం గుర్తించారు. అంతేకాక అటవీ శాఖ మాదిరిగా కలప దుంగల మీద నకిలీ హేమర్ మార్కింగ్ చేసినట్టు నిర్ధారించారు. ఈ కేసులో కూడా సెక్షన్ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

కొత్తూరులో చెరువు కబ్జా

... 5వ పేజీ తరువాయి

గట్టును, పక్కనే వున్న ఖాళీ స్థలాన్ని చదును చేయించాడు. రహదారికి అనుకుని సుమారు 30 సెంట్ల స్థలాన్ని ఆక్రమించాడు. సెంటు రూ.10 లక్షల చొప్పున అనధికారికంగా విక్రస్తున్నట్టు తెలిసింది. వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, తన పలుకుబడిని ఉపయోగించి రెవెన్యూ శాఖ ద్వారా ఎల్‌పీ (ల్యాండ్ పొసెషన్) సరిఫికెట్లు మంజూరు చేయిస్తానని భరోసా ఇస్తున్నాడు. దీంతో కొంతమంది స్థానికులు డబ్బులు చెల్లించి, చెరువు స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నారు. ఎర్ర చెరువు ఆక్రమణపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు చెబుతున్నారు.

ఇదిలావుండగా చెరువు స్థలం ఆక్రమణపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివారావును వివరణ కోరగా, తాను నెల క్రితం ఇక్కడకు బదిలీపై వచ్చానని, అంతకుముందు కార్యదర్శిగా పనిచేసిన రమాకుమారి పదోన్నతిపై బదిలీ అయ్యారని, పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఇంతవరకు తనకు అప్పగించలేదని చెప్పారు. రికార్డులు అందుబాటులో వుంటే చెరువు స్థలాన్ని సర్వే చేయించి ఆక్రమణలను గుర్తించే అవకాశం వుంటుందని తెలిపారు.

ఫుల్లు కిక్కు!

... 5వ పేజీ తరువాయి

జరిగాయి. ఒక్కరోజే జిల్లాలో ఏకంగా రూ.6.28 కోట్ల మద్యం అమ్మకాలు సాగాయి. 2022 డిసెంబరు 31న జిల్లాలో రూ.6.1 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా.. ఈసారి మరో రూ.18 లక్షల మద్యం అధికంగా అమ్ముడుపోయింది. పట్టణ ప్రాంతాలైన అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలిలో మద్యం విక్రయాలు ఎక్కువ జరిగాయి.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు

మద్యం తాగి వాహనాలు నడపకూడదని పోలీసులు జారీ చేసిన హెచ్చరికలను పలుచోట్ల మందుబాబులు బేఖాతరు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం రాత్రి ఎనిమిది గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి, సోమవారం తెల్లవారు జాము వరకు కొనసాగించారు. జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 29 మంది పట్టుబడగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ 74 మంది దొరికిపోయారు. వీరిపై ఆయా స్టేషన్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో ఎక్కువ మంది 40 ఏళ్ల లోపువారే ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, జనవరి 1 : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అంగన్‌వాడీలు 21వ రోజు స్థానిక నెహ్రూచౌక్ సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపిన లోకనాథం మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. అంగన్‌వాడీల 11 డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరవాడలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారానికి 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 21 రోజులుగా రోడ్డెక్కి నిరసనలు, ధర్నాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సీహెచ్. దేవి, కె.లక్ష్మి, బి. జానకి, విజయ, వరలక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. అంగన్‌వాడీలకు భవన నిర్మాణ కార్మికులు మద్దతు పలికారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు శ్రీ మణికంఠ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజాన అప్పలనాయుడు ఆధ్వర్యంలో కార్మికులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు తీరే వరకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎల్ శ్రీను, సీహెచ్ ప్రభాకరరావు, పి.అప్పారావు, కె.సోమునాయుడు, బి.జయ, వరలక్ష్మి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.


అచ్యుతాపురంలో అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపిన భవన నిర్మాణ కార్మికులు


సబ్బవరంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు

రాంబిల్లిలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు సోమవారం మానవహారం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 3వ తేదీన కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, బిల్డింగ్ యూనియన్ నాయకులు శీరం రాంబాబు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీలకు యూటీఎఫ్ నాయకులు తమ్మారావు, సత్యారావు, నాగరాజు సోమవారం మద్దతు తెలిపారు. సమ్మె శిబిరానికి వచ్చి అంగన్‌వాడీల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు రూ.రెండు వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, నాయకురాలు వీవీ రమణమ్మ, వరలక్ష్మి, శివరామలక్ష్మి, బి.రమణమ్మ, దేవి, జగదీశ్వరి పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


వీఆర్వోల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 1 : వీఆర్‌వోల సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతరం వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షులు రామకాసు ఆధ్వర్యంలో ప్రతినిధులు జిల్లాకలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సింహాద్రిలో సమ్మద్ హోల్ ప్రారంభం


సమ్మద్ హాల్‌ను ప్రారంభిస్తున్న సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, జనవరి 1 : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్‌లో నూతనంగా నిర్మించిన సమ్మద్ హాల్‌ను సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా సోమవారం ప్రారంభించారు. తొలుత ఆయన సింహాద్రి ఉద్యోగులు, కుటుంబసభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు ఎస్. గోవిందరాజన్, ఎన్. గడ్డమ్, డీపీ పాత్ర, బీబీ పాత్ర, సింహాద్రి యూనియన్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో టోర్నీలో రెండు బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన క్రీడాకారిణులు

ఎలమంచిలి, జనవరి 1: విజయవాడలో జరిగిన 39వ సీనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఎలమంచిలికి చెందిన ఇద్దరు క్రీడాకారిణిలు రెండు బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో ఎలమంచిలికి చెందిన ఉండా జయశ్రీ, తుంపాల శ్వేత బంగారు పతకాలు సాధించి, రాజస్థాన్‌లో జనవరి 18 నుంచి 20వ తేదీ వరకూ జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినులను రాష్ట్ర తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి అచ్యుతరెడ్డి, జిల్లా కార్యదర్శి అచ్చంనాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలి

» కశింకోటలో బిల్డింగ్ వర్కర్లు నిరసన


నిరసన చేస్తున్న భవన నిర్మాణ సంఘం నాయకులు

కశింకోట, జనవరి 1 : సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికసంఘం (సీఐటీయూ) నాయకులు సోమవారం ఇక్కడ నిరసన చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు టి. అప్పారావు, ఎస్. శ్రీనివాసరావు, డి.శ్రీను, శేషగిరి, సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ కార్మిక సంక్షేమ బోర్డు ఇచ్చిన లేబరుకార్డు కార్మికుల వివాహాలు, మరణాలు, ప్రమాదాలకు గురైనప్పుడు, డెలివరీలు, వారి పిల్లలకు ఎంతో ఉపయోగపడేదన్నారు. 2019 నుంచి వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకాలన్నీ ఇప్పటి వరకూ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బిల్డింగ్ కార్మికులకు అందాల్సిన పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగేశ్వరరావు, చిన్న నాగేశ్వరరావు, రాము, శేషు, గోవింద, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు చేపట్టాలి

» టీడీపీ నాయకుల వినతి

పరవాడ, జనవరి 1 : ఇసుక అక్రమ తరలింపుపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు పైలా పైడంనాయుడు, పైలా కృష్ణ, వర్రి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రాజమండ్రి నుంచి ఇసుక లోడుతో వచ్చిన లారీని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి ర్యాంప్ నుంచి ఇసుకలోడుతో బయలుదేరిన లారీ పరవాడ సంతోషిమాత ఆలయం సమీపంలో అన్‌లోడ్ చేస్తుంది. అక్కడకు చేరుకున్న టీడీపీ నాయకులు ఇసుకకు సంబంధించిన బిల్లులను చూపించాలని డ్రైవర్‌ను కోరగా బిల్లును చూపించారు. బిల్లుపై అనకాపల్లి జిల్లా అని రాసి మాత్రమే ఉంది. ఎక్కడ ఇసుక అన్‌లోడ్ చేస్తారన్న విషయం అందులో పేర్కొనలేదు.

ఇదే విషయాన్ని టీడీపీ నాయకులు డ్రైవర్ గణేష్‌ను ప్రశ్నించారు. అయితే ఆయన అనకాపల్లి జిల్లా రాసి ఉంటే సరిపోతుందని సమాధానమిచ్చారు. దీంతో టీడీపీ నాయకులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్ఐ గఫూర్, వీఆర్వో వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌తో మాట్లాడారు. అప్పటికే ఇసుకను అన్‌లోడ్ చేసేశారు. ఖాళీ లారీను టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు తరలించారు. ఇసుక అన్‌లోడ్ చేసే ఏరియాను తప్పనిసరిగా బిల్లులో పేర్కొవాలని వీఆర్వో స్పష్టం చేశారు. లారీతో పాటు డ్రైవర్ గణేష్‌ను తమ అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు.

శ్రీకృష్ణుడికి పుష్పాభిషేకం


కృష్ణుడు విగ్రహానికి పూలాభిషేకం చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్,జనవరి 1 : కనకదుర్గమ్మ అమ్మవారి చండీయాగ మహోత్సవంలో భాగంగా గంగిరేవిచెట్టు వద్ద గంగవరదేశమ్మ భవానీలు ద్వారక దీష శ్రీకృష్ణుడికి పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీరామ్, భవానీ భక్తులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో పాండురంగడు


కూర్మావతారంలో దర్శనమిస్తున్న పాండురంగడు

పాయకరావుపేట, జనవరి 1: పట్టణంలోని రాధారుక్మిణి సహిత పాండురంగస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పాండురంగస్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి పాండురంగస్వామి, అమ్మవార్లకు పూజాక్రతువులు నిర్వహించిన అనంతరం స్వామివారిని కూర్మావతారంలో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.వెంకటాద్రి పాల్గొన్నారు.

'రాష్ట్రస్థాయి పంచాయతీ సదస్సుకు తరలిరండి'

ఎస్.రాయవరం, జనవరి 1: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఈనెల 3వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ సదస్సుకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తరలి రావాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేజెర్ల వినోద్‌రాజు సోమవారం ప్రకటనలో కోరారు. సర్పంచుల నిధులు, వారి అధికారాలను రాష్ట్ర ప్రభుత్వం హస్తగతం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదన్నారు. దీనివల్ల పంచాయతీల్లో అభివృద్ధి పనులు ప్రజాప్రతినిధులు చేయలేకపోతున్నారన్నారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ. 8,660 కోట్లను, ఉపాధిహామీ పథకం నిధులు రూ. 36 వేల కోట్లను జగన్ ప్రభుత్వం దారిమళ్లించిందన్నారు.

పీఆర్‌టీయూ కాలెండర్ ఆవిష్కరణ

ఎస్.రాయవరం, జనవరి 1: మండలంలోని కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పీఆర్‌టీయూ కాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, జనరల్ సెక్రటరీ వి.శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు గారా రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డులు పంపిణీ

మునగపాక, జనవరి 1: మండలంలోని పాటిపల్లి, నారాయుడుపాలెంలలో సోమవారం బీజేపీ నాయకులు ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాత్ర కో-ఆర్డినేటర్ మళ్ల కాశేశ్వరరావు మాట్లాడుతూ ఆయుష్మాన్ కార్డు ద్వారా ప్రతి వ్యక్తికి ఐదు లక్షల విలువైన ఆరోగ్య బీమా రక్షణ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడారి త్రిమూర్తులు, గ్రామ పెద్దలు కాండ్రేగుల సూరిబాబు, జగ్గఅప్పారావు, దేవి పాల్గొన్నారు.

ఏడో రోజూ కొనసాగిన పారిశుధ్య కార్మికుల సమ్మె


మంట వేసి నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జనవరి 1 : జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల సమ్మె ఏడో రోజు సోమవారం కొనసాగింది. మా ఆకలి మంటలు తీర్చండంటూ జీవీఎంసీ కార్యాలయం ఎదుట మంటలు వేసి నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. నిరసనలో బొమ్మల రాము, శివకుమార్, గణేష్, నిమ్మకాయల అజయ్‌కుమార్, సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పీవీ చలపతిరావుకు ఘన నివాళి

అనకాపల్లి టౌన్, జనవరి 1: భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షులు దివంగత పీవీ చలపతిరావు మొదటి వర్ధంతిని సోమవారం ఆ పార్టీ నాయకులు ఎన్టీఆర్ జంక్షన్ వద్ద నిర్వహించారు. చలపతిరావు చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ జీవీ సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు పార్టీ నాయకుడు కోలపర్తి శ్రీనివాసరావు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు భరణికాన నరసింహమూర్తి, గొంతిన భక్తసాయిరాం, కేవీ ప్రభాకర్, కె.వెంకటరావు, కర్రి రామకృష్ణ, బొడ్డేడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు నక్కపల్లి క్రీడాకారిణులు

నక్కపల్లి, జనవరి 1: నక్కపల్లికి చెందిన ఇద్దరు క్రీడాకారిణులు అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, సెక్రటరీ కొల్నాటి తాతాజీ చెప్పారు. నవంబరు 3 నుంచి 5వ తేదీ వరకూ నక్కపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 హాకీ టోర్నమెంట్‌లో నక్కపల్లికి చెందిన ఎం.పూర్ణిమ, పి.విష్ణువర్థిని మంచి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. కర్ణాటకలో జనవరి 2వ తేదీ నుంచి జరగనున్న జాతీయ పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు.

కశింకోటలో జనసేన కార్యాలయం ప్రారంభం


పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న పరుచూరి భాస్కరరావు

కశింకోట, జనవరి 1: కశింకోటలో జనసేన పార్టీ మండల కార్యాలయాన్ని సోమవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తుతో టిక్కెట్ ఏ పార్టీ నేతలకు ఇచ్చినా సమిష్టిగా వారి గెలుపునకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయని చేతకాని కోడి గుడ్డు మంత్రి అమర్‌నాథ్ అని విమర్శించారు. అంతకుముందు జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. జనసేన పార్టీ నాయకుడు బుదిరెడ్డి చిన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుదిరెడ్డి మోహన్, గెంజి సత్యారావు, పావాడ కామరాజు, ఉత్తాడ రామరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని పూజలు

కశింకోట, జనవరి 1: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవరంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరారు. అనంతరం గొంతిన శ్రీనివాసరావును గజమాలతో కార్యకర్తలు, నాయకులు సత్కరించారు.




తారువలో డిప్యూటీ సీఎం బూడికి, నర్సీపట్నంలో అయ్యన్నకు కేడర్ శుభాకాంక్షలు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



చోడవరంలో విప్ ధర్మశ్రీకి బొకే అందిస్తున్న వైసీపీ నాయకులు



బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో తాతయ్యబాబుకు టీడీపీ శ్రేణుల సత్కారం



చీడికాడలో పీవీజీ కుమార్‌కు పార్టీ కేడర్ శుభాకాంక్షలు



చోడవరంలో జనసేన నాయకుడు కేఎస్ఎన్‌రాజుకు జనసైనికులు సత్కారం

నర్సీపట్నం/చోడవరం/ మాడుగుల, జనవరి 1 : ఏ ఇల్లు చూసినా సందడి.. ఏ వీధి చూసినా కోలాహలం.. ఏ ఆలయం చూసినా భక్తిపారవశ్యం.. ఇవీ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కనిపించిన దృశ్యాలు. నూతన సంవత్సరానికి జిల్లావాసులంతా ఆనందోత్సాహాల నడుమ స్వాగతం పలికారు. మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లుల ద్వారా పాత సంవత్సరానికి వీడ్కోలు చెపుతూ.. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. అర్ధరాత్రి పన్నెండు గంటలు కాగానే జనమంతా ఒకటే కేరింత. ఇళ్లలోనూ, పలు కార్యాలయాల్లోనూ కేక్‌లు కట్‌చేస్తూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇక ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లకు అభిమానుల తాకిడి అధికంగా కనిపించింది. కొందరు బొకేలు, క్యాలెండర్లు, డైరీలు, పుష్పగుచ్ఛాలు, ఫలాలు, స్వీట్లు వంటి వాటిని వారికి అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.. కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే జరగాలని, సంకల్పాలు సిద్ధించాలని ఇష్టదైవాలను వేడుకున్నారు.

అస్తవ్యస్తంగా నాతవరం గ్రామ రహదారి



అధ్వాన్నంగా ఉన్న నాతవరం మెయిన్‌రోడ్డు

నాతవరం, జనవరి 1 : మండల కేంద్రం నాతవరం మెయిన్ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడికక్కడ పెద్దపెద్ద గోతులు పడడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు పైపుల లీకేజీ కారణంగా రోడ్డు మరింత పాడవుతోంది. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిందిగా గ్రామస్థులంతా కోరుతున్నారు.

ఫుల్లు కిక్కు!

... 5వ పేజీ తరువాయి

జరిగాయి. ఒక్కరోజే జిల్లాలో ఏకంగా రూ.6.28 కోట్ల మద్యం అమ్మకాలు సాగాయి. 2022 డిసెంబరు 31న జిల్లాలో రూ.6.1 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా.. ఈసారి మరో రూ.18 లక్షల మద్యం అధికంగా అమ్ముడుపోయింది. పట్టణ ప్రాంతాలైన అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలిలో మద్యం విక్రయాలు ఎక్కువ జరిగాయి.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు

మద్యం తాగి వాహనాలు నడపకూడదని పోలీసులు జారీ చేసిన హెచ్చరికలను పలుచోట్ల మందుబాబులు బేఖాతరు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం రాత్రి ఎనిమిది గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి, సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగించారు. జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 29 మంది పట్టుబడగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ 74 మంది దొరికిపోయారు. వీరిపై ఆయా స్టేషన్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో ఎక్కువ మంది 40 ఏళ్ల లోపువారే ఉన్నారు.

కొత్తూరులో చెరువు కబ్జా

... 5వ పేజీ తరువాయి

గట్టును, పక్కనే వున్న ఖాళీ స్థలాన్ని చదును చేయించాడు. రహదారికి అనుకుని సుమారు 30 సెంట్ల స్థలాన్ని ఆక్రమించాడు. సెంటు రూ.10 లక్షల చొప్పున అనధికారికంగా విక్రస్తున్నట్టు తెలిసింది. వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, తన పలుకుబడిని ఉపయోగించి రెవెన్యూ శాఖ ద్వారా ఎల్‌పీ (ల్యాండ్ పొసెషన్) సరిఫికెట్లు మంజూరు చేయిస్తానని భరోసా ఇస్తున్నాడు. దీంతో కొంతమంది స్థానికులు డబ్బులు చెల్లించి, చెరువు స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నారు. ఎర్ర చెరువు ఆక్రమణపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు చెబుతున్నారు.

ఇదిలావుండగా చెరువు స్థలం ఆక్రమణపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివారావును వివరణ కోరగా, తాను నెల క్రితం ఇక్కడకు బదిలీపై వచ్చానని, అంతకుముందు కార్యదర్శిగా పనిచేసిన రమాకుమారి పదోన్నతిపై బదిలీ అయ్యారని, పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఇంతవరకు తనకు అప్పగించలేదని చెప్పారు. రికార్డులు అందుబాటులో వుంటే చెరువు స్థలాన్ని సర్వే చేయించి ఆక్రమణలను గుర్తించే అవకాశం వుంటుందని తెలిపారు.

అటవీ శాఖలో అవినీతి వృక్షాలు

... 5వ పేజీ తరువాయి

పీసీసీఎఫ్‌కు అందజేశారు. దీనిని పరిశీలించిన అటవీ శాఖ ఉన్నతాధికారులు.. నకిలీ చలానా జారీ చేసిన రాజవొమ్మంగి రేంజ్ అటవీ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. అనకాపల్లి జిల్లా అటవీ అధికారి కూడా విచారణ చేసి సీసీఎఫ్‌కి నివేదిక అందజేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న అధికారులు, సిబ్బందిపై చార్జ్‌షీటు సిద్ధం చేశారు. నర్సీపట్నం కలప డిపో అధికారులు లంచం తీసుకొని తునిక కలప వ్యాన్‌ను విడిచి పెట్టారని రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో, జిల్లా అటవీ అధికారి నివేదికల్లో పొందుపరిచినప్పటికీ ఇంతవరకు శాఖా పరంగా చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పైగా తునిక కలప కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని సీసీఎఫ్ పరిధిలోని జీఐఎస్ విభాగానికి డిప్యూటేషన్ మీద పంపంచారు.

టేకు కలప రవాణా కేసులోనూ ఇదే తీరు!

బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట పంచాయతీ ఉప్పరిగూడెంలో గత ఏడాది అక్టోబరులో ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం సిబ్బందితో కలిసి దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. టేకు కలపకు రూట్ పర్మిట్ లేకుండా కేవలం రూ.4,800 కాంపౌండింగ్ రుసుము రశీదు మాత్రమే ఉండడంతో ట్రాక్టర్‌తోసహా కలపను సీజ్ చేసి నర్సీపట్నం డిపోకు తరలించారు. టేకు కలప కొలతలు తీసి 6.35 సీఎంటీ (222 అడుగులు) ఉన్నట్టు నిర్ధారించారు. ఇంత భారీ మొత్తం కలపకు రూ.4,800 కాంపౌండింగ్ రుసుము చాలా తక్కువని, కలపను అక్రమంగా తరలించడానికి సెక్షన్ అధికారి సహరించారని స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం గుర్తించారు. అంతేకాక అటవీ శాఖ మాదిరిగా కలప దుంగల మీద నకిలీ 'హేమర్ మార్కింగ్' చేసినట్టు నిర్ధారించారు. ఈ కేసులో కూడా సెక్షన్ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.



నర్సీపట్నంలో ముగ్గులు వేసి, సీఎం ఫొటో పెట్టి వినూత్నంగా ఆందోళన



బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో అంగన్‌వాడీల నిరసన



రావికమతం హైస్కూల్‌లో భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

పోరాటం విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర

» ఎన్ని అడ్డంకులు సృష్టించినా డిమాండ్లు సాధించి తీరుతాం » అంగన్‌వాడీలు స్పష్టీకరణ » వివిధ రూపాల్లో నిరసనలు



గొలుగొండలో కోలాటం ద్వారా సర్కారుకు వ్యతిరేక నినాదాలు



చీడికాడలో ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, జనవరి 1 : రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్‌వాడీలు అల్టిమేటం జారీ చేశారు. ఈనెల మూడో తేదీలోగా తమ డిమాండ్లు పరిష్కరించాలని స్పష్టం చేశారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, తురకలపూడి, రాజాం సచివాలయాల వద్ద సోమవారం పలు సాంస్కృతి కార్యక్రమాల ప్రదర్శన ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఎలిశెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మి మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్లను ఆమోదించాలని మూడు వారాలుగా సమ్మె చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పది డిమాండ్లలో నాలుగింటిని ఆమోదించిన ప్రభుత్వం, మిగతా ఆరు డిమాండ్లను కూడా ఆమోదించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రావికమతం : డిమాండ్ల సాధనకు ఆందోళనను మరింత ఉధృతం చేయాలని అంగన్‌వాడీలు నిర్ణయిం చారు. ఇందులో భాగంగా తొలుత రావికమతం హైస్కూల్‌లో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల ప్రతినిధి సత్యవేణి మాట్లాడుతూ దీర్ఘకాలంగా డిమాండ్లపై పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆందోళనను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభు త్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆం దోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం శిబిరంలో దీక్షను కొనసాగించారు.

నర్సీపట్నం : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు 21వ రోజు సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శుభ్రం చేసి ముగ్గులు పెట్టారు. అనం తరం సీఎం ఫొటో పెట్టి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన సరకులు పంపిణీ చేయాలని. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు సామ్రాజ్యం, కృష్ణవేణి, మహాలక్ష్మి, శోభ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట గొలుగొండ, నాతవరం మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం ఆడుతూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. అనం తరం సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎం.మంగతాయారు మాట్లాడుతూ వేతనం రూ.26వేలు చేయడంతో పాటు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, పదోన్నతుల వయస్సు పెంచాలని కోరారు. యూనియన్ నాయ కులు భ్రమరాంబ, సత్య రెండు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చీడికాడ: డిమాండ్ల పరిష్కారానికి మండలంలోని పదమూడు సచివాలయాల వద్ద అంగన్‌వాడీలు సోమవారం ఆందోళన చేపట్టారు. చీడికాడ దీక్షా శిబిరంలో సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయా పంచాయతీల కార్యదర్శులకు, ఎంపీపీ కురచా జయమ్మకు సంఘం నాయకులు వినతి పత్రాలు అందజేశారు.

ఇంటింటికీ శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వానపత్రిక



అక్షింతలు శిరస్సుపై పెట్టుకుని శివపురం వెళుతున్న అయ్యన్న

నర్సీపట్నం, జనవరి 1 : అయోధ్యలోని శ్రీరామునికి పూజ చేసిన అక్షింతలు, ఆహ్వాన పత్రికల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు చేతుల మీదుగా శనివారం ఇక్కడ ప్రారంభించారు. ఈనెల 22వ తేదీన అయోధ్య మందిరంలో శ్రీరాముని విగ్రహం ప్రతిష్ఠ జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతి ఇంటికి అక్షింతలు, ఆహ్వాన పత్రికలను పంపించాలని రామ జన్మభూమి ట్రస్టు నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం అయ్యన్నపాత్రుడు ఆహ్వాన పత్రికలు, అక్షింతలు శిరస్సుపై పెట్టుకొని శివపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రముఖ్ కట్టమూరి శేఖర్, పూడా వెంకట్రావు, వెలగా నారాయణరావు, కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, పైల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'బాబు పాలన కోసం ఎదురుచూపు'



రామానాయుడును సన్మానిస్తున్న నాయకులు

చీడికాడ, జనవరి 1 : చంద్రబాబు పాలన కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. అప్పలరాజుపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో మూడు నియోజకవర్గాల మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, అద్దేపల్లి జగ్గారావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, బొబ్బాది తాతారావు, చరకాన సూర్యనారాయణ, ఉండూరు దేముడు, సీడీసీ మాజీ చైర్మన్ మజ్జి తాతబాబు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గిరిజాంబగిరి



గిరిజాంబ గిరిపై పూజలందుకుంటున్న స్వామి

బుచ్చెయ్య పేట, జనవరి 1 : నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం వడ్డాది గిరిజాంబగిరి భక్తులతో కిటకిటలాడింది. స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కొత్త సంవత్సరం ఆనందోత్సాహాల నడుమ సాగాలని అంతా స్వామివారిని వేడుకున్నారు.

'మధ్యాహ్న భోజనం' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న

నర్సీపట్నం, జనవరి 1 : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆమె ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. వేతనాలు పెంచాలని, ప్రమాద బీమా కల్పించాలని, వంట గ్యాస్ ఉచితంగా అందించాలని, పాఠశాలల విలీనం పేరుతో తొలగించి కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని కోరారు. వీటన్నింటి పరిష్కారానికి ఈనెల ఐదో తేదీన విజయవాడలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్నతల్లి, నూకరాజు, జగది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు యువకులు చేరిక



వడ్డిప గ్రామంలో బీజేపీలో చేరిన యువకులు

రోలుగుంట, జనవరి 1 : మండలంలోని వడ్డిప గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం బీజేపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై వీరు పార్టీలో చేరినట్టు చెప్పారు.

అర్ధంతరంగా నిలిచిన ఆర్‌బీకే భవన నిర్మాణం



నిర్మాణం నిలిచిన భవనంలో గేదెను కట్టిన దృశ్యం

మాకవరపాలెం, డిసెంబరు 1 : మండల కేంద్రం మాకవరపాలెంలో రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. అర్ధంతరంగా నిలిచిపోవడంతో స్థానికులు పశువులను కట్టుకుంటున్నారు. నిధులున్నా పనులు జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.25 లక్షతో పనులను ప్రారంభించారు. పల్లర్లు వేసి శ్లాబ్ లెవెల్ వరకు పనులు జరిగాయి. అనంతరం నిలిచిపోవడం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దీంతో రైతులు ప్రభుత్వం అందించే విత్తనాల దగ్గర నుంచి ఎరువుల వరకూ పక్కనున్న తామరం సచివాలయానికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఈ కారణంగా తమకు అదనపు భారం పడుతున్నదని రైతులు వాపోతున్నారు. కనీసం వచ్చే సీజన్‌కైనా ఈ భవనం నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించాలని కోరుతున్నారు.

పీవీటీజీలకు 'పీఎం జన్‌మన్' వర్తింపజేయాలి



మాట్లాడుతున్న ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు గోవిందరావు

రోలుగుంట, జనవరి 1 : ఆదిమ తెగ గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని నాన్ షెడ్యూల్ ఆదిమ తెగ గిరిజనులకు వర్తింపజేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. మండంలోని పిత్రిగెడ్డ గిరిజన గ్రామంలో సోమవారం పర్యటించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని ఎనిమిది మండలాల్లో 60 గ్రామాల్లో ఇరవై వేల మంది కొండు, గదబ, పరిగి, పురజ వంటి పీవీటీజీ ఆదివాసీ గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు. జన్‌మన్ పథకాన్ని పథకాన్ని ఆయా గ్రామాలకు వర్తింపజేస్తే గృహాలు, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, విద్య, పోషకాహారం, రహదారి, టెలికమ్యూనికేషన్ కనెక్టివిటీ తదితర మౌలిక వసతుల కల్పనకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ గిరిజన తెగలను షెడ్యూల్డ్ ఏరియాలో కలపాలని దీర్ఘకాలంగా ఆదివాసీలు చేపడుతున్న పోరాటాలకు ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమని వాపోయారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ సంఘం మండల కార్యదర్శి కొర్రా కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సీఐ గణేశ్‌కు ప్రశంసలు



సీఐ గణేశ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

నర్సీపట్నం, జనవరి 1 : గత ఏడాది విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన సీఐ గణేశ్‌ను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం ఘనంగా సత్కరించారు. ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు ప్రశంసా పత్రంతోపాటు జ్ఞాపికను అందజేశారు.

వీఆర్వోల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



వీఆర్వోల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 1 : వీఆర్‌వోల సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతకం వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షులు రామకాసు ఆధ్వర్యంలో ప్రతినిధులు జిల్లాకలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో...

ఎస్.రాయవరం: కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పీఆర్‌టీయూ కాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, జనరల్ సెక్రటరీ వి.శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు గారా రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్

నర్సీపట్నం, జనవరి 1 : నాతవరం మండలం కేవీ శరభవరం పంచాయతీ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు దోసరి మహాలక్ష్మి, కార్యకర్తలతో కలిసి సోమవారం టీడీపీలో చేరారు. నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కండువాలు కప్పి వీరిని పార్టీలోకి ఆహ్వానించారు.

రక్షణ గోడ లేక వంటర్లపాలెంలో భయం.. భయం..

» గ్రామ ముఖ ద్వారంగా తాచేరు నది ప్రవాహం

» గతంలో ఉన్న గోడ వర్షాలకు పాడవ్వడంతో గ్రామస్తులు ఆందోళన



వంటర్లపాలెంలో గ్రామ ముఖద్వారంగా ఉన్న తాచేరు



గ్రామ సమీపంలో కోతకు గురైన ఏటిగట్టు

మాడుగుల రూరల్, జనవరి 1 : మండలంలోని వంటర్లపాలెంలో తాచేరు నదీ ప్రవాహం వద్ద రక్షణ గోడ లేకపోవడంతో పలువురు భయాందోళన చెందుతున్నారు. గ్రామ ముఖద్వారంగా ఈ నది ప్రవాహం కొనసాగుతుంది. దీనికి ఆనుకుని ఉన్న రోడ్డు మార్గం గుండా ఆ గ్రామస్థులు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో ఇక్కడ నిర్మించిన రక్షణగోడ భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలకు శిథిలమైంది. దీంతో కొంత మేర మాత్రమే ఉంది. ఒక్కోసారి తుఫాన్ల సమయాల్లో ఏటి ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. అటువంటప్పుడు గట్టు మరింత కోతకు గురవుతున్నది. ఫలితంగా ఆ గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు అంచున అప్రమత్తంగా ఉండకుంటే నదిలో పడిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలపై ప్రయాణించే క్రమంలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ గ్రామానికి ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. ప్రస్తుతం పెద్ద పెద్ద భారీ వాహనాలు వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో పెద్దగా ప్రమాదాలు జరగడం లేదని, ఏటిగట్టు అంచు కోతకు గురైనందున ఒకవేళ పెద్ద వాహనాలు వస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉందని అంటున్నారు. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలపై వెళ్లే క్రమంలో ఏటిగట్టు వద్ద పరిస్థితిని చూసి పలువురు భయపడుతున్నారు. ఏటి గట్టు పటిష్టం చేయడంతో పాటు రక్షణగోడ నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయని అంటున్నారు.

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



అమ్మపేటలో మేలుకొలుపు

గొలుగొండ, జనవరి 1 : ధనుర్మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మేలుకొలుపును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మపేట, పాకలపాడు, జోగంపేట, గొలుగొండ, సాలికమల్లవరం, కొత్తమల్లంపేట, కొత్తఎల్లవరం, గుండుపాల, పుత్తడిగైరంపేట, ఏటిగైరంపేట, ఎర్రవరం, చీడిగుమ్మల, ఏఎల్‌పురం గ్రామాల్లో భక్తులు వేకువనే సీతారాముల చిత్రపటాలను పురవీధుల్లో ఊరేగిస్తూ చక్కని సంకీర్తనలతో ముందుకు సాగుతున్నారు. దీంతో గ్రామ గ్రామాన ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది.